భారీ యంత్రాలతో అక్రమంగా మట్టి తవ్వకాలు

- టిప్పర్లతో మట్టి తరలింపు
- దుమ్ము, ధూళికి పనికిరాకుండా పోతున్న అరటి పంటలు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతన్నలు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు


మోట్నూతలపల్లె కొండలో మట్టిని తవ్వుతున్న జేసీబీ

పులివెందుల రూరల్ : మండలంలోని కనంపల్లె, కొత్తపల్లె, మోట్నూతలపల్లె, ఎర్రబల్లె చెరువు తదితర ప్రాంతాల నుంచి మట్టిని అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అలాగే వెలమవారిపల్లె కొండలను మట్టి మాఫియా తవ్వేస్తోంది. మట్టిని తవ్వడమే కాకుండా కొండలను, గుట్టలను చదును చేస్తున్నారు. దీన్ని అడ్డుకోవాల్సిన రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారే తప్ప ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులను అడ్డుపెట్టుకుని కొండలను పెద్ద, పెద్ద టిప్పర్లతో తవ్వుతూ సొమ్ము చేసుకుంటున్నారు. మట్టిని చాలామంది హౌసింగ్ ఇళ్లకు వ్యాపారులకు, రైతులకు టిప్పర్ రూ.5వేల నుంచి రూ.10వేల వరకు విక్రయిస్తున్నారు. సంబంధిత రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోగా అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మట్టిని తవ్వే కొంతమంది వ్యక్తులు అధికార పార్టీ నాయకుల పేర్లు చెబుతూ స్థానికులను బెదిరిస్తున్నారు. దీంతో పశువులకు మేత లేకుండా చేస్తున్నారని రైతులు కూడా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పులివెందుల మండలానికి ఆరు కిలోమీటర్ల దూరంలోనే మట్టి మాఫియా జరుగుతున్నా సంబంధిత రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మట్టిని తరలిస్తున్నారు. అధికారులు మాత్రం మామూళ్లు తీసుకుంటూ చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తవ్వడానికి ఎవరు అనుమతి ఇచ్చారని స్థానిక రైతులు, ప్రజలు అడుగుతున్నా అధికారులు ఎటువంటి సమాధానం చెప్పడం లేదు. పట్టా భూముల్లో కూడా పరిమితికి మించి గుంతలు తవ్వకూడదని నిబంధనలు కూడా ఉన్నాయి.

దెబ్బతింటున్న అరటి తోటలు

అధిక లోడుతో మట్టిని తరలిస్తుండటంతో మోట్నూతలపల్లె, కొత్తపల్లె గ్రామానికి చెందిన రైతుల అరటి తోటలు దుమ్ము, ధూళికి ఎందుకు పనికి రాకుండా పోతున్నాయి. అరటి తోటలకు సుమారు లక్షల వ్యయంతో పంటలు సాగుచేసి పంటలు చేతికొచ్చే సమయంలో మట్టిని టిప్పర్లు తోలుతుండటంతో దుమ్ము, ధూళికి అరటి తోటలు ఎందుకు పనికిరాకుండా పోతున్నాయని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధిక లోడుతో మట్టి టిప్పర్లు తిరుగుతున్నా సంబంధిత అధికారులు స్పందించడం లేదు. రెవెన్యూ అధికారులు మాత్రం మట్టిని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పత్రికా ప్రకటనలకే పరిమితమయ్యారు. యథేచ్ఛగా మట్టిని అక్రమంగా తరలిస్తున్నా ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని విమర్శలు తలెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్లపైన, యథేచ్ఛగా మట్టిని తవ్వుతున్న జేసీబీలపైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


అక్రమంగా మట్టిని తరలిస్తున్న టిప్పర్


అరటి తోటపై పడిన దుమ్ము, ధూళి

లక్షలు ఖర్చుపెట్టి పంటలు సాగు చేశా



గ్రామ సమీపంలో నాలుగున్నర ఎకరా భూమిని కౌలుకు తీసుకుని లక్షలాది రూపాయలు ఖర్చు చేసి అరటి పంటను సాగు చేశా. మోట్నూతలపల్లె కొండ ప్రాంతం నుంచి కనంపల్లె తోటల మీదుగా పులివెందులకు మట్టిని పెద్ద, పెద్ద టిప్పర్లతో తరలిస్తున్నారు. దుమ్ము, ధూళి అరటి పంటపై పడి పంట ఎందుకు పనికిరాకుండాపోతోంది. దీంతో తీవ్ర నష్టం వాటిల్లుతోంది. సంబంధిత అధికారులకు చెప్పినా చర్యలు తీసుకోవడం లేదు.

– లవకుమార్, అరటి రైతు, కొత్తపల్లె

దుమ్ము, ధూళితో పంటలు వృద్ధి చెందటంలేదు



మోట్నూతలపల్లె కొండల నుంచి మట్టిని అక్రమంగా పెద్ద, పెద్ద టిప్పర్ల ద్వారా పులివెందుల ప్రాంతంలోకి తరలిస్తున్నారు. టిప్పర్లు తోటల దగ్గర నుంచి మట్టిని తరలిస్తుండటంతో అరటి పంటలు వృద్ధి చెందడం లేదు. దీంతో వ్యాపారస్తులు అరటికాయలను కొనుగోలు చేయకుండా వెనక్కి తిరిగి వెళ్లిపోతున్నారు. సంబంధిత అధికారులకు అనేక మార్లు చెప్పిన పట్టించుకోవడంలేదు. ఇలా అయితే రైతులు ఎలా అభివృద్ధి చెందుతారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– కృష్ణానాయక్, అరటి రైతు, కనంపల్లె

రాయలసీమకు తీరని అన్యాయం

జమ్మలమడుగు : కూటమి ప్రభుత్వం రాయలసీమ ప్రాంతానికి తీరని అన్యాయం చేస్తుందని సీపీఎం పార్టీ నాయకుడు సెక్రటరీ ఏసుదాసు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్‌ను అమరావతికి తరలించవద్దు అంటూ గోడ పత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం రాయలసీమ ప్రాంతంలో ఉన్న కార్యాలయాలను అమరావతి తరలించుకుని పోవడం దారుణం అన్నారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సంప్రదాయం ప్రకారం కడపలోనే ఏపీజీబీ ప్రధాన కార్యలయం కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును బాగు చేయండి


అధ్వానంగా ఉన్న చిన్నరంగాపురం రహదారి

పులివెందుల రూరల్ : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని చిన్నరంగాపురం గ్రామం నుంచి ఎర్రంరెడ్డిపల్లె, ఇంటిపల్లె, పెద్దకుడాల, దిద్దేకుంట్ల గ్రామాల రహదారిని బాగుచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఇళ్ల ముందర చిన్న పిల్లలు ఆడు కుంటూ ఉంటారని వాహనాలు వేగంగా వెళుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వారు వాపోతున్నారు. గ్రామంలో రోడ్డుకు సంబంధించి పైపులైన్లు, డ్రైనేజీ కూడా ఇవ్వడం జరిగిందన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రోడ్డుకు ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ


ప్రతిష్ఠించిన శ్రీసీతారామ, లక్ష్మణ విగ్రహాలు

వేముల : వెంకటేశ్వరాపురం గ్రామంలో శ్రీసీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ వేడుకలు ఘనంగా జరిగాయి. రెండు రోజులపాటు ప్రత్యేక పూజల అనంతరం మూడవ రోజు సోమవారం సీతారామ, లక్ష్మణ విగ్రహ ప్రతిష్ఠను నిర్వహించారు. వేద పండితులు కిరణ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో హోమాలు నిర్వహించా. అనంతరం సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కోలాట ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

పంటకోత ప్రయోగం


పంట కోత ప్రయోగాన్ని పరిశీలిస్తున్న ఏఓ

పెండ్లిమర్రి : రబీలో వర్షాధారం కింద సాగు చేసిన బుడ్డశనగ పంట కోత ప్రయోగం సోమవారం తిప్పిరెడ్డిపల్లె పొలాల్లో నిర్వహించారు. పంటకోత ప్రయోగాన్ని వ్యవసాయాధికారి ఓబులేసు తనిఖీ చేశారు. పంట 5 గీ5 మీటర్లు చుట్టు కొలతలలో కిలో 1.350 గ్రాములు దిగుబడి వచ్చిందన్నారు. వాటి వివరాలను ఇన్సూరెన్స్ కంపెనీకి నివేదిస్తామన్నారు. వాటి ఆధారంగానే రైతులకు పంటల బీమా వర్తిసుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ గంగాధర్‌రెడ్డి, ఎంపీఈఓ నాగలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ రోషన్

వల్లూరు : ప్రజలు అప్రమత్తంగా ఉంటే చైన్ స్నాచింగ్‌లు, గృహాలలో దొంగతనాలను నిరోధించడానికి అవకాశం వుంటుందని కమలాపురం సీఐ ఎస్కే రోషన్ అన్నారు. మండలంలో ఇటీవల చైన్ స్నాచింగ్ జరిగిన నేపథ్యంలో సోమవారం ఆటోలకు మైక్‌లను అమర్చి ప్రచారం చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. రాబోవు వేసవి కాలంలో ఇళ్లలో దొంగతనాలు జరగకుండా తీసుకునే చర్యలు గురించి సూచనలు చేశారు. అనుమానిత వ్యక్తులు గ్రామాలకు వచ్చినప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. బంగారు, వెండి తదితర విలువైన వస్తువులను బ్యాంక్ లాకర్‌లో భద్రపరచుకోవాలన్నారు. బంగారు ఆభరణాలు కనిపించకుండా చీర కొంగు కప్పుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రారంభమైన వార్షిక బ్రహ్మోత్సవాలు


హోమాలను నిర్వహిస్తున్న వేద పండితులు

వల్లూరు : పాపాఘ్ని నదీ తీరాన మండలంలోని పైడికాలువ గ్రామంలో వెలసిన శ్రీ రాజ్యలక్ష్మీ సమేత చెన్నకేశవస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవ, కుంభాభిషేక మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రధాన అర్చకులు స్వామి హరి నారాయణ ఆధ్వర్యంలో వేద పండితులు ప్రారంభించారు. ధ్వజారోహణం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం ధ్వజబలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన పారాయణాలు భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని కలుగ చేశాయి.

కుష్టు వ్యాధిపై అవగాహన


మహిళలను పరీక్షిస్తున్న డీపీఎంఓ

లింగాల : కుష్టు వ్యాధిపై ప్రజలకు డీపీఎంఓ పి.వి.రమణారెడ్డి అవగాహన కల్పించారు. కుష్టు వ్యాధి వారోత్సవాల సందర్భంగా ఆయన సోమవారం మురారిచింతల గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరీరంపై స్పర్శలేని మచ్చలను గుర్తించి వాటిని పరీక్షించి కుష్టువ్యాధి లక్షణాలను గుర్తించాలన్నారు. హెల్త్‌సూపర్‌వైజర్ ఆశాబేగం, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి అంగవైకల్య పరీక్షలు

సింహాద్రిపురం : కంటికి, వినికిడి లోపంతో పింఛన్ తీసుకుంటున్న వికలాంగులకు మంగళవారం నుంచి రెండు రోజులపాటు అంగవైకల్య పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. ఈ పరీక్షలకు వెళ్లేటప్పుడు తప్పకుండా మీకు ఇచ్చిన నోటీసుతోపాటు పాత సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పాత మెడికల్ రిపోర్టులు, ఎక్స్‌రేలు తీసుకెళ్లాలన్నారు.

పాఠశాలలో ద్రోణాచార్య విగ్రహ ఆవిష్కరణ

ముద్దనూరు : స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నతపాఠశాల ప్రాంగణంలో గురు శ్రీ ద్రోణాచార్యుని విగ్రహావిష్కరణ గావించారు. సోమవారం 1987–92 సంవత్సరాల కాలంలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థి ఎంవీ రమణారెడ్డి ఆర్థిక సహకారంతో శ్రీ ద్రోణాచార్యుని విగ్రహాన్ని ఆవిష్కరించారు. పాఠశాల పూర్వ విద్యార్థులంతా కలుసుకొన్న సందర్భంగా గురువైనటువంటి ద్రోణాచార్యుని విగ్రహాన్ని సుమారు రూ.1లక్ష వ్యయంతో ఏర్పాటు చేయడం సంతోషమని పాఠశాల ఉపాధ్యాయులు దాత ఎంవీ రమణారెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో తహ సీల్దారు కిషోర్‌రెడ్డి, ఎంపీడీఓ ముకుందరెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజబాబు, ఫిజికల్ డైరక్టర్ మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ద్రోణాచార్యుని విగ్రహావిష్కరణలో ప్రముఖులు

ఆలయానికి వెండి ఆభరణాలు వితరణ


దాత కుటుంబ సభ్యులకు తీర్థ ప్రసాదాలను అందిస్తున్న ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు

వేంపల్లె : స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలోని శ్రీవాసవీ మాతకు 400 గ్రాముల వెండి ఆభరణాలను దాతలు వితరణగా ఇచ్చినట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాయవరం సురేంద్ర తెలిపారు. సోమవారం వేంపల్లె గ్రామానికి చెందిన మేడా వీరభద్రయ్య ధర్మపత్ని సిద్దేశ్వరి జ్ఞాపకార్థం వారి కుమారుడు మేడా చంద్రశేఖర్ రూ.40 వేలు విలువ చేసే వెండి ఆభరణాలు సమర్పించారని, వాసవీమాతకు వెండి ఆభరణాలు వితరణ ఇవ్వడం అభినందనీయమన్నారు. వెండి ఆభరణాలు ఇచ్చిన దాతకు ప్రత్యేక దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, శ్రీవాసవి కల్యాణ మండపం, అవోపా, మహిళా మండలి కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

నమస్కార ప్రదర్శనలో ట్రిపుల్‌ఐటీ విద్యార్థి ప్రతిభ

వేంపల్లె : శత సహస్ర సూర్య నమస్కార ప్రదర్శనలో ఆర్జీయూకేటీ పరిధిలోని ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీ విద్యార్థికి తృతీయ స్థానం వచ్చినట్లు డైరెక్టర్ కుమారస్వామి గుప్తా తెలిపారు. తెలంగాణలోని సిద్దిపేటలో నిర్వహించిన శత సహస్ర సూర్య నమస్కార ప్రదర్శనలో ఆయా ప్రాంతాల నుండి 1,484 మంది యోగా విద్యార్థులు హాజరయ్యారు. సూర్య నమస్కార ప్రదర్శనలో 4,02,154 సూర్య నమస్కారాలు విజయవంతంగా పూర్తి చేయడం జరిగింది. శత సహస్ర సూర్య నమస్కారాల ప్రదర్శనలో ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ విద్యార్థి విజయ్ ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు ఎలాంటి ఆహారం, విశ్రాంతి తీసుకోకుండా మొత్తం 1,456 సూర్య నమస్కారాలు పూర్తిచేశారు. సోమవారం విజయ్ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్, యోగా ఇన్‌స్ట్రక్టర్లు అభినందించారు.


విజయ్‌కి ప్రశంస పత్రాన్ని అందజేస్తున్న అధికారులు

లోపాలుంటే ఉపేక్షించం

ఎర్రగుంట్ల : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో లోపాలు ఉంటే ఉపేక్షించమని డిప్యూటీ డీఈఓ మీనాక్షి తెలిపారు. సోమవారం మండలంలోని పలు పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంను తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. హెయిర్ స్టైల్ విషయంలో జుట్టు చింపిరిగా ఉంటే వెంటనే కట్ చేయించాలని ఉపాధ్యాయులను హెచ్చరించారు. యూనిఫాం కచ్చితంగా ధరించి పాఠశాలకు రావాలన్నారు. విద్యార్థులకు సాయంత్రం ఒక గంట పాటు చేతి రాతపై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు శివప్రసాద్, రామాంజనేయరెడ్డిలు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

సత్తా చాటిన విద్యార్థిని


బహుమతిని అందుకుంటున్న విద్యార్థిని వీరారోహిణి

ఎర్రగుంట్ల : చిలంకూరులోని శ్రీసాయి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో చదువుతున్న కటారు వీరా రోహిణి వేదిక్ గణితం పోటీల్లో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచి సత్తా చాటిందని ఆ పాఠశాల కరస్పాండెంట్ ఎన్.గంగరాజు సోమవారం తెలిపారు. అదివారం విజయవాడలో రాష్ట్రస్థాయి వేదిక్ మ్యాథ్స్ పోటీలు నిర్వహించారు. పోటీలు విశ్వం ఎడ్యుకేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించారన్నారు.

రైతులకు గిట్టుబాటు ధరే ప్రభుత్వ లక్ష్యం

జమ్మలమడుగు : రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధరలను కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక మార్కెట్‌యార్డులో ఏపీ మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు పండించిన కందులను ప్రభుత్వం క్వింటా రూ.7550 కొనుగోలు చేస్తుందన్నారు.

ఘనంగా శ్రీవేంకటరమణుడి బ్రహ్మోత్సవాలు


కల్యాణంలో సతీసమేత శ్రీవేంకటరమణుడు


కల్యాణం తిలకిస్తున్న భక్తాదులు

పులివెందుల టౌన్ : శ్రీవేంకటరమణుడు ఆలయంలో వారం రోజులుగా జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం శ్రీవేంకటరమణుడు పగలు హనుమద్వాహనం, రాత్రి గజ వాహనాలపై కొలువుతీరి భక్తులు దర్శనమిచ్చారు. భక్తులు గోవింద నామస్మరణలతో దేవదేవుని ఆరాదించారు.

స్వామివారు తమ ఇంటి ముంగిటకు రాగానే గోవిందా అంటూ భక్తిపారవశ్యంతో పూజా ద్రవ్యాలు, కాయ కర్పూరాలు సమర్పించి వేడుకున్నారు. సాయంత్రం గజవాహనంపై పురవీధులలో స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. పట్టణ పురవీధులైన పూలంగళ్ల సర్కిల్, మెయిన్ బజార్, ముత్యాలవారివీధి, గాడిచర్లవీధి, అమ్మవారిశాల వీధుల మీదుగా భక్తులకు దర్శనమిచ్చి కనువిందు చేశారు. ముందుగా ఆలయంలో ఉదయం సుప్రభాత సేవ, తోమాలసేవ, సహస్రనామార్చాన, నివేదన, నిత్య హోమం, కలశారాధన, పూజాది కార్యక్రమాలను నిర్వహించారు.


వేంకటరమణుడి కల్యాణం కమనీయం


శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటరమణుడి కల్యాణం ఆలయ అర్చకులు వరదాచార్యులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవాయిద్యాల నడుమ కన్నుల పండువగా శ్రీవారి కల్యాణం నిర్వహించారు. ఈ కల్యాణంలో జూనియర్ సివిల్ కోర్టు జడ్జి చంద్రశేఖరరెడ్డి పాల్గొని తిలకించారు.


శాశ్వత ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలి

కమలాపురం : పట్టణంలో శాశ్వత ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని మన ఊరు సేవా సమితి అధ్యక్షుడు శీలం శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఆయన మున్సిపల్ కమిషనర్ పగడాల జగన్నాథ్‌కు శాశ్వత ఆధార్ సెంటర్ ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కమలాపురం నియోజకవర్గ కేంద్రం, నగర పంచాయతీ, అయినప్పటికి పట్టణంలో ఆధార్ కేంద్రం లేక పోవడం దారుణం అన్నారు. ప్రతి ఒక్కరికి ఆధార్ ఎంతో అవసరం. ఆధార్‌లో మార్పులు, చేర్పులు, తదితర వివరాలు నమోదు చేసుకోవడానికి ఆధార్ కేంద్రానికి వెళ్లాలంటే కడప, ప్రొద్దుటూరు తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆధార్ సేవల కోసం వృద్ధులు, వికలాంగులు, చిన్న పిల్లలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొందరు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని, మరి కొందరు ఈ ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన అన్నారు. ఇటీవల ఆధార్ సేవల కోసం కడపకు వెళ్లి తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ 17 ఏళ్ల చందు అనే యువకుడు మృతి చెందాడని ఆయన గుర్తు చేశారు. మండల అధికారులు స్పందించి కమలాపురంలో శాశ్వత ఆధార్ కేంద్రం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు.

నులిపురుగుల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలి


పులివెందుల : చిన్నారులకు నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేస్తున్న సీడీపీఓ


కమలాపురం : విద్యార్థినులకు మాత్రలు మింగిస్తున్న నగర కమిషనర్ జగన్నాథ్


ఎర్రగుంట్లలో విద్యార్థులకు నూలిపురుగల మాత్రలను వేస్తున్న అడిషనల్ డీఎంహెచ్ఓ

వేంపల్లె : నులిపురుగుల బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలని తాళ్లపల్లె పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ షఫీవున్నీషా సూచించారు. సోమవారం స్థానిక ఏపీ మైనారిటీ గురుకుల పాఠశాలలో జాతీయ నులిపురుగుల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న అల్బెండజోల్ మాత్రలు విద్యార్థులకు పంపిణీ చేశారు. అలాగే ఆమె మాట్లాడుతూ అల్బెండజోల్ మాత్రలు తీసుకోవడం ద్వారా నులిపురుగులను నిర్మూలించవచ్చునన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సుగుణమ్మ, స్టాఫ్ నర్సు అరుణ, ఏఎన్‌ఎం నాగస్వర్ణ, ఆశాలు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : చంద్రగిరి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం నులి పురుగుల మాత్రలను చిన్నపిల్లలకు అందించారు. ఈ సందర్భంగా సీడీపీఓ శ్రీలత మాట్లాడుతూ పిల్లలకు తప్పనిసరిగా నులి పురుగుల మాత్రలు వేయాలన్నారు. నులి పురుగులు కడుపులో ఉంటే సరిగా ఆకలి వేయదన్నారు. తమ పిల్లలకు నులి పురుగు మాత్రలు వేయించాలన్నారు. సూపర్‌వైజర్, మాబున్నీ, అంగన్‌వాడీ టీచర్ సునీత, తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రిపురం : జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర డాక్టర్ హుస్సేన్ నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వివేకానంద హైస్కూలులో జరుగుతున్న ఈ ప్రక్రియను ఎంపీడీఓ కృష్ణమూర్తి పరిశీలించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నె : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలలు నులిపురగునివారణ మాత్రలను పంపిణీ చేసినట్లు స్థానిక వైద్యాధికారి రాఘవేంద్ర తెలిపారు. కార్యక్రమాలను చింతకొమ్మదిన్నె ఎంపీడీవో కుల్లాయిబాబు, ఎంఈఓ వెంకటరమణారెడ్డి పర్యవేక్షించారు.

తొండూరు : నులి పురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలను తప్పకుండా తీసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ అరిపుల్లా తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నులి పురుగుల నివారణా మాత్రలను అందించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య, హెడ్మాస్టర్ సుధాకర్, ఉపాధ్యాయులు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : వ్యక్తి గత పరిశుభ్రత వల్ల రోగాలన్నీ దూరం అవుతాయని అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.రవిబాబు తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జాతీయ వార్మింగ్ డే సందర్భంగా విద్యార్థులకు నూలిపురుగుల నివారణ మాత్రలను అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ మీనాక్షి, ఎంఈఓలు, వైద్యులు, హెచ్‌ఎం, సిబ్బంది పాల్గొన్నారు.

లింగాల : ఎగువలింగాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ సుభాషిణి నులి పురుగుల మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ కుసుమకుమారి, ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కమలాపురం : ఆల్బెండజోల్ మాత్రలను చిన్న పిల్లలతో మింగిస్తే వారిలో ఉండే నులి పురుగులను నివారించడంతో పాటు వారిలో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని పెద్దచెప్పలి పీహెచ్‌సీ వైద్యాధికారిణి జ్ఞాన ప్రసూన తెలిపారు. సోమవారం జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్న పిల్లలకు నులి పురుగుల నివారణ మాత్రలను మింగించారు. స్థానిక గురుకుల పాఠశాలలో నగర కమిషనర్ పగడాల జగన్నాథ్ విద్యార్థినులకు మాత్రలు వేశారు. అలాగే పెద్దచెప్పలి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ప్రసూన పలు పాఠశాలల్లో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను మింగించారు.

నేడు విద్యుత్ నిలిపివేత

వేముల : మండలంలోని పెద్దజూటూరు, రాచకుంటపల్లె, భూమయ్యగారిపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ ఏఈ శ్రీనివాసులు ఒక ప్రకటన ద్వారా తెలిపారు.